క్లుప్తంగా

పెండింగ్ బకాయిలు చెల్లించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తుర్కయంజాల్: మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు, పెండింగ్ వేతనాలు సకాలంలో రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అలివేలు, సభ్యుడు గణేశ్, లక్ష్మమ్మ, శిరీష, రంగమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

యాచారం పీఎస్ సందర్శన

యాచారం: ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు బుధవారం యాచారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కేసుల నమోదు, ఫిర్యాదుల స్వీకరణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ శంకర్‌కుమార్‌ను మండలంలోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రత, రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అడిగి తెలుసుకున్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవు



దుకాణాదారునికి జరిమానా విధించిన మున్సిపల్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మార్కెట్‌లోని దుకాణాల, విధి వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా వాడుతున్నారన్న ఫిర్యాదుల మేరకు మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అతి తక్కువ మైక్రాన్లు వున్న ప్లాస్టిక్ కవర్లను ఎవరూ వాడినా సహించేదిలేదన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: ప్రభు త్వ భూములను కాపాడటమే మా బాధ్యత, క బ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మొ యి నాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నా రు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడటం మా బాధ్యత అని అన్నారు. మొయినాబాద్ మండలంలో కొంత మంది ప్రభుత్వ భూముల పక్కనే ప్రైవేటు భూములను కొనుగోలు చేసి నంతరం ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నట్లు తమ దృష్టికివచ్చిందన్నారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినా వెంటనే కూల్చివేయిస్తామన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

డిప్యూటీ తహసీల్దారు ఆనంద్‌సింగ్



మాట్లాడుతున్న ఆనంద్‌సింగ్

షాద్‌నగర్: రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని డిప్యూటీ తహసీల్దారు ఆనంద్‌సింగ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీఏఎం డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవద్దని న్యాయబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మశ్చందర్, అధ్యాపకులు మణివర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

వంద శాతం వసూళ్లే లక్ష్యం



పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

- కమిషనర్ రఘు
- బడంగ్‌పేట్ అభివృద్ధికి పాటుపడండి
- సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ అభివృద్ధికి అధికారులు నడుంబిగించారు. పేరుకుపోయిన బకాయిలు వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వంద శాతం వసూలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్ల అభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నారు. 2023–24లో రూ. 27 కోట్లను టార్గెట్‌గా పెట్టుకున్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకూ రూ.15 కోట్లు పన్నుల రూపంలో వసూలు చేయడంలో విజయం సాధించారు. కాగా చిన్నపాటి పరిశ్రమలు, షెడ్లకు ప్రభుత్వం కొంత మినహాయింపు ఇచ్చింది. మొండి బకాయిలు వసూలు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆస్తిపన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్న పన్నుదారులకోసం కొత్త స్కీము తీసుకువచ్చింది. 90 శాతం వడ్డీ మాఫీతో కేవలం 10 శాతంతో పేరుకుపోయిన బకాయిలు చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. పేరుకుపోయిన బకాయిల చెక్ లిస్ట్ పట్టుకుని బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఆర్వో, మేనేజర్, బిల్ కలెక్టర్లు ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్ను వసూలు చేసే పనిలో ఉన్నారు. మార్చి 31 లోగా ఆస్తి పన్నులు చెల్లించి, రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్లలో ఆస్తిపన్నులు బకాయిలు ఉన్నాయి. ఎగవేతదారులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పించింది. ఈ అవకాశం మార్చి 31వరకు ఉంది. దీన్ని పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఆస్తి పన్నులు చెల్లించి బడంగ్‌పేట్ నగర అభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నాను. పన్నులు చెల్లిస్తేనే మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుంది.

– రఘు, కమిషనర్

దీనికోసం ఆటోల్లో మైకులు పెట్టి, కూడళ్లల్లో బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టి అవగాహన కల్పిస్తున్నారు. నూరుశాతం వసూలుకు విశ్వప్రయత్నాలు చేస్తూ పన్నుదారులకు అవగాహన కల్పించి బకాయిలను కట్టించుకుంటున్నారు.



సీఐ కాశీవిశ్వనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న మమత

వీడియోలు పోస్టు చేసిన కార్పొరేటర్‌పై ఫిర్యాదు

మీర్‌పేట: వాట్సాప్ గ్రూపుల్లో అవమానించేలా వీడియో పోస్టు చేసిన బీజేపీ కార్పొరేటర్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్ మమత స్థానిక నాయకులతో కలిసి బుధవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన మేయర్ అవిశ్వాసానికి సంబంధించి నమ్మించి మోసం చేశారని బీజేపీ కార్పొరేటర్ నీలారవినాయక్ తన వాట్సాప్ స్టేటస్‌లో, వాట్సాప్ గ్రూపుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్ల వీడియోను పోస్టు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వీడియోను పోస్టు చేసి కార్పొరేటర్ల పరువుకు భంగం కలిగించిన కార్పొరేటర్ నీలారవినాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు నవీన్‌గౌడ్, సిద్దాల బీరప్ప, అనీల్‌యాదవ్, ఇతర నాయకులు ఉన్నారు.

'కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం'

మహేశ్వరం: పద్మశాలి జన చైతన్యం, అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మస్న రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. జల్‌పల్లి శ్రీరాం కాలనీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికీ కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న పద్మశాలీలు అన్ని రంగాల్లో వెనుకంజలోనే ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనసుతో కార్పొరేషన్ చేయడంతో కులస్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రితో పాటు చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ కార్యదర్శిగా వెంకటేశ్వర్లుగుప్తా



వెంకటేశ్వర్లుగుప్తాకు అవార్డు అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి

కందుకూరు: లయన్స్‌క్లబ్ ఉత్తమ కార్యదర్శిగా వెంకటేశ్వర్లుగుప్తాకు అవార్డు అందజేశారు. హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన గీతాంజలి రీజియన్ కాన్ఫరెన్స్‌లో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ సాధు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ జి మహేంద్ర కుమార్‌రెడ్డి, కాన్ఫరెన్స్ చైర్మన్ ఎస్ సుధాకర్‌రెడ్డి అవార్డు అందజేశారు. బెస్ట్ డయాబెటిక్ శిబిరం, రక్తదాన శిబిరం, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్, మీల్స్ ఆన్ వీల్స్, బెస్ట్ ఫొటో ఎగ్జిబిషన్ అవార్డులు కందుకూరు క్లబ్‌కు దక్కాయి. ఆ అవార్డులను అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రామస్‌బాబు, మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, బీఆర్ రాంరెడ్డి, ఐనవోలు రాంగోపాల్‌రెడ్డి, గడ్డం దీపారెడ్డి, ఉపాధ్యక్షుడు జి అమరేందర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి



నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

కందుకూరు: కవయిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని కుమ్మరి సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసుల సురేశ్, జాపాల సుధాకర్ మాట్లాడుతూ ఆనాటి కాలంలో అభ్యుదయ భావాలు కలిగిన మాతృమూర్తి అని అన్నారు. రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రిగా కీర్తికెక్కారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, ప్రధానకార్యదర్శి ఆలూరి జంగయ్య, కార్యదర్శి కుమ్మరి రమేశ్, శేరిగూడెం రాజు, ఉపాధ్యక్షుడు కుమ్మరి సురేశ్, జాపాల ఈశ్వర్, జాపాల శివ, కోశాధికారి కుమ్మరి లింగం, మండల యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి నరేశ్, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



క్రీడాదుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలం పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంను బుధవారం ఆయన ప్రారంభించి, విద్యార్థులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. పాఠశాలల అదనపు గదుల నిర్మాణానికి చేయూతనందిస్తానని చెప్పారు. అలాగే, విద్యార్థులకు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ బాలమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రమేష్, శివకుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- వైద్యాధికారి డాక్టర్ సరిత
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ సరిత

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలని ఇబ్రహీంపట్నం వైద్యాధికారి డాక్టర్ సరిత పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం మండలం పరిధిలోని ఉప్పరిగూడ రైతు వేదికలో నిర్వహించారు. అనంతరం 'పోషణబీ.. పాడిబీ' అనే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ధాన్యం పెంపకం, పోషకాలు అందే ఆహార పదార్థాలు, చిరుధాన్యాల ప్రాధాన్యతను మహిళలకు వివరించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వైద్యాధికారి డాక్టర్ సరిత మాట్లాడుతూ.. మహిళలపై వనరులను వెచ్చించాలని దేశ పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వాలు మహిళ రక్షణ కోసం చట్టాలను మరింత కఠినతరం చేయాలన్నారు. ఆడపిల్లల ప్రాధాన్యత తెలియజేయాలని చెప్పారు. అమ్మలేని అవని దండగన్నారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను ,దౌర్జన్యాలను కట్టడి చేయడానికి ప్రతి మహిళ శక్తివంతురాలు కావాలని సూచించారు. అనంతరం సీడీపీఓ శాంతిశ్రీ మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన అవసరమన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భారతి, హర్షిత, జిల్లా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు సత్తమ్మ, సరళ, పల్లవి, అరుణ, కల్పన, అంగన్‌వాడీ లీడర్లు రాజ్యలక్ష్మి, బేబి పాల్గొన్నారు.

'పది'కి సిద్ధం



విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

- రంగారెడ్డి జిల్లాలో పరీక్షలు రాయనున్న 50,946 మంది విద్యార్థులు
- 239 కేంద్రాల్లో నిర్వహణ
- పోలీసుల నిఘాలో ప్రశ్నపత్రాలు

హుడాకాంప్లెక్స్: ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 50,946 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో బాలురు 26,492, బాలికలు 24,454 మంది, ప్రైవేటుగా మరో 1012 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తంగా 239 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 239 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 237 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను, 41 మంది అడిషనల్ అధికారులను, 9 మంది ఫ్లయింగ్ స్క్వాడ్లు, 239 మంది సిట్టింగ్ స్క్వాడ్లు విధుల్లో ఉంటారు. సరూర్‌నగర్ మండల పరిధిలో కర్మన్‌ఘాట్ పాఠశాలలో 143, బహదూర్‌గూడలో 147, రాజీవ్‌గాంధీనగర్ 66, చంపాపేట 79, సరూర్‌నగర్ 212, మన్సూరాబాద్ 29, సరూర్‌నగర్ ఉర్దూ మాధ్యమ పాఠశాల నుంచి 17 మంది పరీక్షలు రాయనున్నారు. సరూర్‌నగర్ మండల పరిధిలో 44 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాలు ఈ నెల 12న కేంద్రాలకు అందుబాటులోని పోలీస్‌స్టేషన్లకు చేరాయి. పటిష్ట భద్రత నడుమ వాటిని భద్రపరిచారు. ఉత్తీర్ణత పెంపునకు చర్యలు, గత సంవత్సరం కంటే ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో విద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత నాలుగు నెలలుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాది విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు సాధించారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దారు. పరీక్ష రాసేటప్పుడు విద్యార్థులకు గాలి, వెలుతురు ఉండేలా పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



కందుకూరు మండలంలో 4 పరీక్షా కేంద్రాలు, బాలాపూర్‌లో 19, మహేశ్వరంలో 9, సరూర్‌నగర్‌లో 44 పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాం. ప్రశ్నా పత్రాలు ఆయా పరీక్ష కేంద్రాల పోలీస్‌స్టేషన్లకు చేరుకున్నాయి.

– కృష్ణయ్య, మండల విద్యాధికారి

ప్రశాంత వాతావరణం కల్పిస్తాం



విక్టోరియా మెమోరియల్ హోం కేంద్రంలో 220 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వసతులు కల్పించాం. ప్రశాంతంగా రాయవచ్చు.

– ప్రభుదాస్, ప్రిన్సిపాల్, విక్టోరియా మెమోరియల్ హోం

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. హస్తినాపురం సౌత్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్‌ను కలిశారు. కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. దీంతో కార్పొరేటర్ సౌత్‌కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పావని, కాలనీ ప్రతినిధులు ప్రకాశ్, రాంప్రసాద్, ఎస్ఎన్‌రెడ్డి, శ్రీకృష్ణ, హనుమంతరావు, సుమతి తదితరులు పాల్గొన్నారు.



హస్తినాపురం సౌత్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతా నాయక్

కేబినెట్ నిర్ణయాలపై కృతజ్ఞతల వెల్లువ

పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్




అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ బొళ్ళ యాదగిరి

కడ్తాల్: ఎన్నో సంవత్సరాలుగా కార్పొరేషన్లు లేని సామాజిక వర్గాలకు, ఆయా సామాజిక వర్గాల విజ్ఞప్తి మేరకు కొత్తగా 16 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని పీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో వెనుకబడిన తరగతులకు చెందిన పలు సామాజిక వర్గాలు, కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని, అప్పటి ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముదిరాజ్, మున్నూర్ కాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేరా, గంగాపుత్ర, ఈబీసీ సంక్షేమ బోర్డు, ఆర్యవైశ్య, రెడ్డి, మాదిగ ఉపకులాల కార్పొరేషన్లతో పాటు, కొమరంభీం ఆదివాసీ, సంత్‌సేవాలాల్ లంబాడ, ఏకలవ్య తదితర కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఆయా సామాజిక వర్గాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500ల ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కేటాయించడం, ఇళ్లు లేని నిరుపేదలకు వరమని, సొంతింటి కళ నెరవేరే రోజు వచ్చిందన్నారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, రేషన్‌కార్డుకు సంబంధం లేకుండా ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తామని కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హీరాసింగ్, జవహర్‌లాల్ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

ఆమనగల్లు: పద్మశాలీల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ఆమనగల్లు పద్మశాలీ సంఘం నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పద్మశాలీయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వీలైనంత త్వరగా పద్మశాలీ కార్పొరేషన్‌కు కమిటీని నియమించి నిధులు కేటాయించాలని కోరారు.

తలకొండపల్లి: ముదిరాజ్ సంఘ కార్పొరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఉందన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం సంక్షేమం కోసం, వారి జీవితాల్లో వెలుగులు తీసుకురావడానికి ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రేవంత్‌రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, అహర్నిశలు పోరాటం చేసిన రాష్ట్ర ముదిరాజ్ నాయకులకు బొళ్ళ యాదిగిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌ల సంక్షేమానికి ఎలాంటి కృషి చేయలేదన్నారు. ముదిరాజ్‌లందరూ రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడతామని పేర్కొన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందనున్నారని యాదగిరి తెలిపారు.

ప్రపంచ మహామేధావి అంబేడ్కర్

మాజీ ఉప సర్పంచ్ సొల్లు సుధాకర్



కరపత్రాన్ని ఆవిష్కరించిన నాయకులు

తలకొండపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మహామేధావి అని మాజీ ఉప సర్పంచ్ సొల్లు సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో మార్చి 26న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, తదితర సంఘాల నాయకులు విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ.. అన్యాయాలు, అసమానతలు, అణచివేతలు, అవమానాలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేసి, కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికై మొదటి న్యాయశాఖ మంత్రిగా పని చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధాకర్, మాజీ సర్పంచ్ కుమార్, బీఎస్పీ నాయకులు జంగయ్య, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, శేఖర్‌యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, కుమార్, కిరణ్‌పూలే, రాజు, మధు, ప్రవీణ్‌కుమార్, అనిల్, గణేశ్, యాదగిరిరెడ్డి, మల్లేశ్, యాదగిరి, మనోహర్, సుధాకర్, భరత్, అఖిల్, దశరథం, రవి, హరికుమార్, శివ, జగదీశ్, వంశీ, తేజ, తదితరులు పాల్గొన్నారు.